క్లుప్తంగా

రాజీవ్ యువవికాసానికి దరఖాస్తు చేసుకోవాలి

తాంసి: రాజీవ్ యువ వికాసం పథకానికి నేటితో గడువు ముగుస్తున్నందున్న అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి ఆదివారం ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు జిరాక్స్ పత్రాలతో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రోజు సమర్పించాలని కోరారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు'

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో పాడైన చేతిపంపులకు మరమ్మతులు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. భోరజ్ మండలంలో ఈనెల 7 నుంచి 12 వరకు మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

'మాభూమి రథయాత్ర' విజయవంతం చేయండి

బోథ్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు డైట్ మైదానంలో ప్రారంభయ్యే మాభూమి రథయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ నాయకులు వెంకటేశ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం కోసం విశారదన్ మహరాజ్ చేపడుతున్న యాత్రలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు.

బీసీ నాయకులు తరలిరండి

ఆదిలాబాద్‌రూరల్: ధర్మ సమాజ్ ఆధ్వర్యంలో డాక్టర్ విశారదన్ మహరాజ్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో లక్ష కిలో మీటర్ల యాత్ర ప్రారంభిస్తున్నారని జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ హాజరవుతున్నందున జిల్లాలోని 36 బీసీ కుల సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు, బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

మన్నెవార్ తెగను ఆహ్వానించడం సరికాదు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జోడేఘాట్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభకు మన్నెవార్ తెగను ఆహ్వానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. మన్నెవార్‌లుగా ఉన్న వీరు కొలవార్‌గా చెలామణి అవుతున్నారని అన్నారు. ఆదివాసీ తొమ్మిది తెగలకు పెద్దన్న పాత్ర పోషిస్తున్న తుడుందెబ్బ నాయకులు ఈ విషయంపై స్పందించాలని కోరారు.

'వక్ఫ్‌బోర్డు బిల్లు ఉపసంహరించుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్‌బోర్డు బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారి హక్కులను కాలరాసే విధంగా వక్ఫ్‌బోర్డు బిల్లు ఉందని ఆరోపించారు. మసీదు, చర్చిల భూములను తీసుకుంటారని, రానున్న రోజుల్లో ఆలయాల భూములు కూడా తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం ఉంటే సంప్రదించాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలో విద్యుత్ అంతరాయం ఉంటే అధికారులను సంప్రదించాలని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శ్రావణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గాలివాన కారణంగా ఆకోలి, కేదర్‌పూర్ శివారులో రెండు స్తంభాలు విరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, మరుసటి రోజు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం జరిగిందన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

ఉట్నూర్‌రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై క్రైస్తవులు ఆదివారం పట్టణ కేంద్రంలో ప్రధాన వీధుల గుండా శాంతి ర్యాలీ నిర్వహించారు. యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డానియల్ పాస్టర్, సీహెచ్ ఆర్‌జోసెఫ్, రాజరత్నం, బ్రదర్ మిక్కాయల్, క్రైస్తవులు పాల్గొన్నారు.

భవానీమాతకు పూజలు

- 9 గ్రామాల నుంచి తరలిన కుంరం వంశస్తులు
- ఒక దగ్గరికి చేరి రాత్రి జాగారం
- భవానీగూడలో ఆధ్యాత్మిక వాతావరణం



మొక్కు తీర్చుకుంటున్న కుంరం వంశీయులు



నైవేద్యాన్ని సమర్పిస్తున్న కుంరం వంశీయులు



ఆశీర్వాదం తీసుకుంటున్న ఆదివాసీలు



జాగారం చేస్తున్న కుంరం వంశస్తులు

నార్నూర్: ఆదివాసీ గిరిజనులైన కుంరం వంశీయుల ఆరాధ్య దైవం భవానీమాత పూజకు 9 గ్రామాల నుంచి కుంరం వంశస్తులు తరలిరావడంతో నార్నూర్ మండలం భవానీగూడలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు సంప్రదాయ పూజలో నిమగ్నమయ్యారు. ఏటా వేసవిలో గ్రామంలోని భవానీమాతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. శనివారం ఆలయం వద్ద రాత్రి మహా పూజకు శ్రీకారం చుట్టారు. అక్కడే సంప్రదాయ ఆటపాటలతో జాగారం చేశారు. ఆదివారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించి దైవ సన్నిధిలో ఒక కుండలో ఊదితో నింపి ఆముదంతో తయారు చేసిన నూనెతో అగ్గి వెలిగించారు. దీన్ని సంప్రదాయంగా కప్రి అని పిలుస్తారు. అమ్మవారి మందిరం చుట్టూ ఉద్దే ఉద్దే శబ్ద ఘాటో అంటూ పాటలు పాడుతూ డోలు వాయిస్తూ నృత్యం చేశారు. అనంతరం తమ వంశస్తులు చల్లగా సుఖసంతోషాలతో ఉండాలని సూర్య భగవానునికి నమస్కరించి మొక్కులు తీర్చుకున్నారు. వంశ పెద్దలు మాట్లాడుతూ భవానీమాత పూజ నియమ నిష్ఠలతో చేస్తామన్నారు. 15 రోజులు కాళ్లకు చెప్పులు ధరించకుండా విస్తరాకుల మీద భోజనం చేయకుండా తమ ఆచారాన్ని పాటిస్తామన్నారు. కుంరం వంశస్తులు ఈనెలలో పెళ్లిళ్లు కాని అన్నదాన కార్యక్రమాలు ఉన్న సహపంక్తి భోజనాలు చేయరు. అలా చేస్తే వారికి కీడు జరుగుతుందని నమ్ముతామన్నారు. నవధాన్యాలతో నైవేద్యం తయారుచేసి అమ్మవారికి సమర్పించి అక్కడే సహపంక్తి భోజనాలు చేస్తామన్నారు. మరుసటి రోజు గ్రామాల్లో అందరికీ ఆతిథ్యమిచ్చి భోజనాలు పెట్టిన తర్వాతే పెళ్లిలో ఇతర కార్యక్రమాల్లో పాల్గొని భోజనాలు చేస్తామని తెలిపారు. పెద్దలు పూసం ఈశ్రు పటేల్, కుంరం తెలంగాణ రావు, కుంరం చిత్రు, కుంరం లాల్ సావ్, తొడసం కాశీరామ్, కుంరం దాదిరావు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పొచ్చర ఉన్నత పాఠశాలలో 1998–1999 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదివి ఆయా రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు హాజరయ్యారు. ఆనాడు చదువు చెప్పిన గురువులను శాలువాతో సత్కరించారు. తరగతి గదుల్లో కూర్చొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

కాంట్రాక్ట్ టీచర్లకు వేతనాలు చెల్లించాలి



డీఈవోను సన్మానిస్తున్న నాయకులు

నేరడిగొండ: డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ టీచర్ల పెండింగ్ వేతనాలు చెల్లించేలా చూడాలని టీఎస్ యూటీఎఫ్ నేరడిగొండ మండల నాయకులు కోరారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శాలువాతో సత్కరించారు. మండలంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్ల రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన డీఈవో సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, జ్యోతి, కిశోర్, శివలీల, సుజాత పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు పూర్తి



జెండా అలంకరించిన కమిటీ సభ్యులు

ఇంద్రవెల్లి: రాజ్యంగా నిర్మాత ఈనెల 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా తోరణాలు, జెండాలతో అలంకించారు. అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ తెలిపారు. సోమవారం సాయంత్రం మండలకేంద్రంలో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. దళితులు, గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసమే పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న భోజారెడ్డి, ఆడే గజేందర్

తాంసి: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే ప్రజలకు అవగాహన కల్పించడానికే కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంవిధాన్ పాదయాత్ర చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం భీంపూర్ మండలంలోని సెంటర్ సాంగి గ్రామం నుంచి భీంపూర్ మండల కేంద్రం వరకు జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. భారత రాజ్యాంగంతో పాటు అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలను చేతబట్టి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవారెడ్డి, శ్రీధర్ రెడ్డి, రమేశ్, అన్ను పటేల్, తన్వీర్ పటేల్, వెంకట్ రెడ్డి, సుదర్శన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్‌రావు

బజార్‌హత్నూర్: ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలని బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని న్యూఅనంతపూర్ గ్రామంలో గంజాయి, గుట్కా, డ్రగ్స్, గుడుంబా సేవించడం వల్ల జీవితాలు ఎలా నాశనమవుతాయో తెలుపుతూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన పనులు చేయకూడదన్నారు. మొబైల్ ఫోన్ వినియోగించే వారు జాగ్రత్తగా ఉండాలని, అనుమానిత కాల్స్‌ను, మెసేజ్‌లను స్వీకరించకూడదని, ఎవరికీ తమ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పకూడదన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై లింబాజీ, మాజీ ఎంపీపీ మాన్కూ, మాజీ సర్పంచ్ నగేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన బాటలో నడుస్తూ.. ఆయన ఆశయాలను కొనసాగించాలని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి శ్రీనివాస్, రెండో బహుమతి శివాంగి అగర్వాల్ గెలుచుకున్నారు. మొదటి విజేతకు రూ.1200, రెండో విజేతకు రూ.800 ప్రదానం చేశారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ జగ్‌రాం, సుజాత, శ్రీనివాస్, విజయ్ కుమార్, షమీమ్, షేక్ తబ్రేజ్, రాంలఖన్ సింగ్, అజీజ, అనిల్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వానం

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో ఈనెల 16న నిర్వహించే ఊర పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌లకు బోథ్ గ్రామస్తులు ఆదివారం ఆహ్వానించారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆడె గజేందర్ ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో గ్రామజ్యోతి అధ్యక్షుడు బడాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ స్వామి, కొర్రి సురేశ్, వెండి సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని బాజీరావు బాబా భక్తులు అన్నారు. ఆదివారం మండలంలోని కరంజి(కె) గ్రామంలో బాజీరావు బాబా కళా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. చిన్నారులు దేవతల వేషాధారణలో ఆకట్టుకున్నారు. డప్పుచప్పుళ్లతో భజన సంకీర్తనల నడుమ శోభాయాత్ర సాగింది. గత వారం రోజులుగా ఈ కార్యక్రమం నిర్వహించగా, చివరి రోజు గ్రామస్తులు ఘనంగా వేడుకలు నిర్వహించారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి



చలివేంద్రం ప్రారంభిస్తున్న డిపో మేనేజర్

ఆదిలాబాద్: వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఠాకూర్ హోటల్ ఆర్టీసీ బస్సుస్టాప్ వద్ద ఆదివారం సమనుజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్, తిరుపతి రెడ్డి, వెంకట రమణ, సుధాకర్, విజయ్, న్యాయవాదులు దేవేందర్, వెంకట్ కుమార్, సుధీర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

బోథ్: సొనాల మండలంలోని సాకెర గ్రామానికి చెందిన కుందూరు రాకేశ్ ఇటీవల మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న సొనాల గ్రామానికి చెందిన యువశక్తి సంఘం సభ్యులు ఆదివారం మృతుడి కుటుంబానికి రూ. 13 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటారు. కుటుంబానికి మరింత సాయం చేయడానికి ముందుంటామన్నారు. కార్యక్రమంలో యువశక్తి యూత్ అధ్యక్షులు తుల హరీశ్, ఉపాధ్యక్షుడు గాజుల సుగుణాకర్, దాసరి లక్ష్మణ్, సింగం నందికేశ్వర్ పాల్గొన్నారు.

చాకుతో బైక్‌పై ప్రదర్శన చేసిన సలీం అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: బైక్‌పై తిరుగుతూ చాకుతో ప్రదర్శన చేసి ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని బంగారుగూడకు చెందిన షేక్ సలీం.. రామాయి శివారు ప్రాంతంలో గల రోడ్డుపై చాకు చేతులో పట్టుకుని బైక్‌పై తిరుగుతున్నారు. అంతేకాకుండా ఆ ఫొటోలను ఇన్‌స్టాగాంలో పోస్ట్ చేశాడు. ఉదయం ఆ ఫొటోలను గమనించి అతన్ని అరెస్టు చేసి చాకును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. షేక్ సలీంపై ఇప్పటికే ఏడు కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో సీఐ ఫణిధర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాఘాపూర్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వాఘాపూర్ శివారు ప్రాంతంలో ఆదివారం పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడిచేశాం. పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.35,360 నగదుతో పాటు తొమ్మిది సెల్‌ఫోన్లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని సావపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. పక్కా సమాచారం రావడంతో ఆదివారం పేకాట స్థావరంపై దాడిచేసినట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఉప్పుల రాకేశ్, గైక్వాడ్ కిషన్, అగర్కర్ రవీందర్, రావత్ అమూల్, సేవపూరి ప్రమోద్, లాడే సుధాకర్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.16,830 నగదుతో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఏఎస్సై సిరాజ్, కానిస్టేబుళ్లు రాజ, శ్రీనివాస్, రయాజొద్దీన్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

ఉట్నూర్‌రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి పై మార్ఫింగ్ వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడాన్ని ఖండిస్తున్నామని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అరికిల్ల పరమేశ్వర్‌రావ్ అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు భరత్ చౌహాన్‌పై ఫిర్యాదు చేశారు. సీఎంను అవమాన పరుస్తూ సోషల్‌మీడియాలో పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో కొత్తపెల్లి మహేందర్, కలీం పాషా, రవి, నిసార్ పాల్గొన్నారు.

నర్సరీలో అగ్నిప్రమాదం



మామిడి తోటలో చేలరేగిన మంటలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం వికలాంగుల కాలనీ సమీపంలో గల హార్టికల్చర్ నర్సరీలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నర్సరీలోని మామిడి వనంలో చెత్తాచెదారానికి నిప్పు అంటుకోవడంతో మంటలు చేలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

సైనిక్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

నేరడిగొండ: నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన వేణుగోపాల్ కుమార్తె వాహిని ఇంటర్నల్ స్పోర్ట్స్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని కోరుకొండ సైనిక్ స్కూల్‌కు తెలంగాణ నుంచి ఎంపికై విద్యను అభ్యసిస్తోంది. క్రీడల్లోనూ సైతం రాణిస్తోంది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఇంటర్నల్ స్పోర్ట్స్ కాంపిటేషన్స్‌లో 5.2 కేఎం రన్ విజయవంతంగా పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచింది. కోరుకొండ స్కూల్ ఉపాధ్యాయులు ఆమెకు మొదటి బహుమతి అందజేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కల్లూరుగూడ గ్రామంలో నూతన హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ సోనేరావు, రాము, మాన్కు, మారు, శ్యంరావు, భీంరావు, భారత్, పాలిక్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాబా యజమానిపై కేసు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ సమీపంలో వచ్చి తినిపో దాబాలో మద్యం సేవిస్తున్న వ్యక్తులతో పాటు దాబా యజమాని వెంకటస్వామిపై కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. జైనథ్ భీంపూర్ పోలీసులతో కలిసి ఆదివారం సాయంత్రం దాబాలో తనిఖీ చేపట్టారు. ఆ దాబాలో నిల్వ చేసిన 16 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ వెంట ఏఎస్సై ముంతాజ్, సిబ్బంది ఉన్నారు.